సాక్షి 24/7 తూర్పుగోదావరి
శనివారం 25-8-2018
EAST GODAVARI
గరిష్ఠం 32.0° / కనిష్ఠం 26.0°

# ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విప్లవాత్మక మార్పులు

- రోగ నిర్ధారణ, నివారణ సులభతరం
- ఎన్ఐఓహెచ్ డైరెక్టర్ కమలేష్ సర్కార్

**బాలాజీచెరువు (కాకినాడ సిటీ):** వైద్యరంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వల్ల రోగ నిర్ధారణతో పాటు నివారణ చాలా సులభతరమైందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపేషనల్ హెల్త్ (ఎన్ఐఓహెచ్) డైరెక్టర్ డాక్టర్ కమలేష్ సర్కార్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో శుక్రవారం ఎన్విరాన్‌మెంటల్, ఆక్యుపేషనల్ హెల్త్ సేఫ్టీ టెక్నాలజీస్ అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. కమలేష్ సర్కార్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం రోగికి వచ్చిన జబ్బును కనుగొని, నివారించడం కష్టతరమయ్యేదన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వల్ల ఆ స్థితి తొలగిపోయిందన్నారు. బయో మెడికల్ ఇంజినీరింగ్, బయో టెక్నాలజీల వలన వైద్య వృత్తి సులభతరమైందన్నారు. భవిష్యత్‌లో జీన్ రీప్లేస్‌మెంట్, స్టెమ్ సెల్ థెరపీ వలన ముందుగానే రోగాలను కనిపెట్టి జాగ్రత్త చర్యలు తీసుకోవచ్చన్నారు. వైద్యం, సాంకేతికతను రెండింటిని సమీకృతం చేయగలిగితే వైద్య రంగంలో ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. వైద్యులు, సైంటిస్టులు, ఇంజనీర్లు సంయుక్తంగా పరిశోధన జరిపి రోగ రహిత మానవ సమాజానికి తోడ్పడాలన్నారు.

**ఆరోగ్యం, భద్రతలపై అవగాహన పెంచుకోవాలి..**

మరో ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ విశాల్ గున్నీ మాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాపులకు హాజరై ఆరోగ్యం, భద్రతపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎటువంటి విపత్తు జరిగినా ముందుగా స్పందించేది పోలీసు అధికారులేనని, ప్రతి ఒక్కరూ సహకరించి ప్రాణ, ఆస్తి నష్టం నివారించేందుకు కృషి చేయాలన్నారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, లేదంటే రాబోయే రోజుల్లో నీటికోసం యుద్ధాలు సంభవించే అవకాశాలున్నాయన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. జేఎన్‌టీయూకే రెక్టార్ డాక్టర్ పూర్ణానందం మాట్లాడుతూ కార్మికుల భద్రతకు తీసుకోవలసిన జాగ్రత్తలపై జేఎన్‌టీయూకేలో ఆక్యుపేషనల్ హెల్త్ సేఫ్టీ కోర్సు బోధిస్తున్నామని, బయో మెడికల్ ఇంజనీరింగ్ వలన ఆధునిక వైద్య రంగంలో ఎన్నో అద్భుతాలు సృష్టించగలుతున్నామని చెప్పారు. అనుభవంతో కూడిన పరిశోధనల వలన మానవాళి అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం అతిథులను సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ఇండో అమెరికన్ సొసైటీ ఫర్ హెల్త్ ఎడ్యుకేషన్ మెంబర్ ఎంకే ప్రసాద్, కేఎస్‌పీఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మురళీధర్, ఐసీఎంఆర్ సైంటిస్ట్ డాక్టర్ బి.రవిచంద్రన్, పార్మసీ కోర్సుల ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీయూఎం ప్రసాద్, ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ సభ్యులు ఎస్.సురేఖ, కోరమండల్ హెచ్ఆర్ మేనేజర్ మూర్తి పాల్గొన్నారు.



సదస్సులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్పీ విశాల్ గున్నీ, జేఎన్‌టీయూకే రెక్టార్ పూర్ణానందం